సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



నష్టాల ఊబిలో చింత రైతులు

చింతను సాగుచేస్తున్న రైతులకు చింతే మిగిలింది. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించక ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనికి తోడు ఈసారి ఈదురు గాలులతో పంటకు నష్టం వాటిల్లింది. 8లో




డివైడర్ ఢీకొని విద్యార్థి మృతి

బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ విద్యార్థి మృతి చెందాడు. మరో విద్యార్థికి గాయాలయ్యాయి. జోగిపేట ఫైర్‌స్టేషన్ మలుపు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. 8లో

ముగ్గురికి పాజిటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 16 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ముగ్గురికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 15 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.



బీఆర్‌ఎస్‌ది జనరంజక పాలన

- వచ్చే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు గుణపాఠం చెప్పాలి
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

జహీరాబాద్: బీఆర్‌ఎస్‌ది జన రంజక ప్రభుత్వమని, వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు తిరిగి గెలిపించుకోవాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం మొగుడంపల్లి మండలంలోని ధనాసిరి గ్రామంలో రూ.3.19 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో జెడ్పీటీసీ అరుణ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టి రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. పక్కనే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్ణాటకలోని బీజేపీ పాలనతో పోల్చితే తెలుస్తుందన్నారు. గతంలో వైద్యం కోసం పేదలు అల్లాడేవారని, ప్రస్తుతం 84 శాతం ప్రసవాలు సర్కారు దవాఖానాల్లోనే జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో నీటి కష్టాలను శాశ్వతంగా దూరం చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలన్నారు. మాజీ మంత్రి గీతారెడ్డికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఆమె హయాంలో ప్రజలకు ఎలాంటి సంక్షేమ ఫలాలు అందలేదన్నారు. అలాగే జహీరాబాద్‌లోని పీవీఆర్ గార్డెన్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులను, రూ.7.85కోట్ల కల్యాణలక్ష్మి చెక్కులను, రూ.3.81కోట్ల వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. రాత్రి సమయంలో బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో మైనార్టీ కమిషన్ సభ్యుడు ఎండీ తన్వీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. జహీరాబాద్‌లో ఆటో నగర్ కోసం నాలుగు ఎకరాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, ఎమ్మెల్సీ వెంకట్‌రాంరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, జెడ్పీటీసీ అరుణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ హబ్సిరాజు, టీఎస్ ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కర్ణాటక మాజీ మంత్రి బండెప్ప, ఎస్పీ రమణకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ధనాసిరిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే మాణిక్‌రావు, తదితరులు

త్వరలో 'గృహలక్ష్మి'

ఝరాసంగం(జహీరాబాద్): ఇళ్లు లేని పేదలకు త్వరలో గృహలక్ష్మి పథకం ద్వారా నిర్మాణానికి రూ.3 లక్షలు అందించనున్నట్లు ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, కలెక్టర్ డాక్టర్ శరత్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. తర్వాత మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నాటి పాలకుల హయాంలో గుడ్డి దీపాలు, నేడు బీఆర్‌ఎస్‌తో నాణ్యమైన విద్యుత్ నిరంతరంగా సరఫరా అవుతోందన్నారు. గ్రామ అభివృద్ధికి టీఎస్ఐఐసీ అధికారులతో చర్చిస్తానని, రూ.కోటి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, శిక్షణ ఇప్పించి యువతకు ఉద్యోగాలు కల్పించేలా పాటుపడతానన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాచయ్య స్వామి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జగదీశ్వర్, సర్పంచ్ ఓంప్రకాష్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.



ఎల్గోయి సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే తదితరులు

బీజేపీతోనే దేశాభివృద్ధి

పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నరేందర్ రెడ్డి

కంది(సంగారెడ్డి): బీజేపీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం కందిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అన్నిరంగాల్లోఅభివృద్ధి జరిగిందన్నారు. కార్యకర్తలు, నాయకులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, సంగమేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధితో పాటు సంక్షేమం



చెక్కులు పంపిణీ చేస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్: అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తూ దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం జిల్లా గ్రంథాలయంలో 120 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి, తహసీల్దార్ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ సునీత, సీడీసీ మాజీ చైర్మన్ విజేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

11న జెడ్పీ సమావేశం

సంగారెడ్డి టౌన్: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సీహెచ్ ఎల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 11న ఉదయం 11 గంటలకు జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా అధికారులు తమ, తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశానికి హాజరుకావాలని కోరారు. సభ్యులందరూ నిర్ణీత సమయంలోగా సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

న్యూస్‌రీల్

పూలే జయంతిని విజయవంతం చేయాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: మహాత్మ జ్యోతీరావ్ పూలే జయంతిని జయప్రదం చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 11న పూలే 197వ జయంతిని పురస్కరించుకొని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆర్ అండ్‌బీ కార్యాలయం వద్ద పూలే విగ్రహానికి పుష్పమాలంకరణ, అనంతరం నటరాజ్ థియేటర్ పక్కన కల్వకుంట రోడ్డులో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ వేడుకలకు వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పరీక్షల్లో భాగంగా గురువారం తృతీయ భాష పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 21,370 మంది విద్యార్థులకు గానూ 21,338 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. జిల్లాలో 99.85 శాతం హాజరు నమోదైంది. జిల్లా ఇన్‌చార్జి డీఈఓ విజయ జిన్నారం, బొల్లారం, బొంతపల్లిలో ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 32 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

వడగళ్ల వాన.. నేలవాలిన జొన్న



మిర్జాపూర్(ఎన్)లో నేలకొరిగిన జొన్న పంట

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మిర్జాపూర్(ఎన్), తాట్‌పల్లి టేకూర్ తదితర గ్రామాల్లో గురువారం వడగండ్ల వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు వాతావరణం పొడిగా ఉండి సాయంత్రం మేఘాలు కమ్ముకొని ఈదురు గాలులతో కూడిన వడగండ్లతో వర్షం పడింది. తాట్‌పల్లిలో భారీ వర్షం కురిసింది. వర్షానికి గాలి తోడు కావడంతో రైతులు సాగు చేస్తున్న జొన్న పంట నేలవాలింది. ఉల్లి, మామిడి తదితర పంటలు దెబ్బతిన్నాయి.

ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కార్పొరేట్ విద్యాసంస్థలను కట్టడి చేసేందుకు ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాపార్తి లింగమూర్తి, కార్యదర్శి నాగరాజు అన్నారు. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర కమిటీ సమావేశాల్లో భవిష్యత్ పోరాట ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. నూతన విద్యా విధానం రద్దు చేయాలని కోరుతూ జూలైలో బస్సు యాత్ర నిర్వహిస్తామన్నారు. పేపర్ లీకేజీతో నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. పదో తరగతి పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాల ధరను పెంచే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఉద్యోగ కేలండర్ విడుదల చేసి పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ చేయాలని కోరారు. అంతకు ముందు ఎస్‌ఎఫ్‌ఐ కార్యాచరణ కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలి

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కావెంజర్లను ఏర్పాటు చేసి పాఠశాలల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ రకాల బిల్లులు మార్చి 31 వరకూ చెల్లించలేదని, ఆ బిల్లుల మొత్తాన్ని వెంటనే చెల్లించాలన్నారు. పండిట్, పీఈటీ అప్‌గ్రెడేషన్, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. తక్షణమే నూతన పీఆర్‌సీ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడివప్ప, రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్ దేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బసవరాజ్, నర్సింహారెడ్డి, రమేశ్, మల్లికార్జున్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జోగిపేట పట్టణంలో గురువారం ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. క్లాక్‌టవర్ వద్ద ఉన్న హనుమాన్ దేవాలయం నుంచి హనుమాన్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహించారు. శోభాయాత్రను అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ప్రారంభించారు. ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు కాషాయ పగిడీలు ధరించి నృత్యాలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎమ్మెల్యే నిలువెత్తు కాషాయ జెండాను పట్టుకొని యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే సౌండ్‌కు అనుగుణంగా నృత్యాలు చేసుకుంటూ ముందుకు కదిలారు. జైశ్రీరాం, జైజై శ్రీరాం అంటూ యువకులు నినాదాలు చేశారు. గౌని చౌరస్తా, శ్రీపోచమ్మ దేవాలయం, పబ్బతి హనుమాన్ దేవాలయం మీదుగా శోభాయాత్ర కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్లు మల్లికార్జున్, డీబీ నాగభూషణం, ఆలయ కమిటీకి చెందిన రుద్రారం మాణయ్య, పురం లక్ష్మణ్, మాజీ ఎంపీపీ రామాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ గాజుల నవీన్, భజరంగదళ్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదు రోజుల్లో డిపాజిట్ చెల్లించాలి

అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ఐదు రోజుల్లో డిపాజిట్లు చెల్లించాలని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. గురువారం అందోల్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్, అందోల్, పుల్కల్, చౌటకూరు, వట్‌పల్లి, మునిపల్లి మండలాలకు చెందిన ఎంపీడీఓలు, ప్రజాప్రతినిధులు, సొసైటీ సభ్యులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఐదు మండలాలకు సంబంధించి 4,086 టార్గెట్ కాగా ఇప్పటివరకు కేవలం 403 మంది మాత్రమే డిపాజిట్లు చెల్లించినందున మిగతా 3,683 మంది డిపాజిట్లు చెల్లించాల్సి ఉందని, తొందరగా చెల్లించాలన్నారు. ఈ సంవత్సరం కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరియని స్పష్టం చేశారు. అర్హులైన వారికి 3, 4 రోజుల్లో కులం సర్టిఫికెట్లు అందించేలా తహసీల్దార్లు, ఎంపీడీఓలు చూడాలన్నారు. సభ్యులు చనిపోయిన వారుంటే నామినీ పేర చెల్లించవచ్చునని తెలిపారు. నియోజకవర్గంలోనే మొదటి ప్రాధాన్యతగా పైలట్ ప్రాజెక్టు కింద గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీపీ అధ్యక్షుడు బాలయ్యతో పాటు వెటర్నరీ అధికారులు పాల్గొన్నారు.

నిర్మించారు.. ప్రారంభం మరిచారు

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన మండల వనరుల కేంద్రం భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. ఏడాది క్రితం రూ.30లక్షలతో పనులు ప్రారంభించి నిర్మాణాన్ని పూర్తి చేసినా వినియోగంలోకి తేవడం లేదు. మండల వనరుల కేంద్రం అందుబాటులో లేక ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు అందోల్ మండల వనరుల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ఆర్‌పీఎం ఏఈ మల్లప్పను వివరణ కోరగా గత నెలలో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఉండగా పలు కారణాలతో వాయిదా పడిందన్నారు. త్వరలోనే ప్రారంభోత్సవం ఉంటుందని, ధ్వంసమైన అద్దాలను తొలిగించి కొత్త వాటిని ఏర్పాటు చేస్తామన్నారు.



ప్రారంభానికి నోచుకోని మండల వనరుల కేంద్రం

సదుపాయాలకు మంగళం!

- ఉపాధి కూలీలకు ఐదేళ్లుగా అందని పరికరాలు
- పని ప్రదేశంలో నీడ కరువు
- పట్టించుకోని అధికారులు
- ఎండలో ఇబ్బంది పడుతున్న కూలీలు



చెట్టుకింద సేద తీరుతున్న కూలీలకు ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

మునిపల్లి(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. వేసవి సమీపిస్తున్నా నిబంధనల ప్రకారం కూలీలకు కల్పించాల్సిన వసతులపై అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. ఇప్పటికే ఎండ తీవ్రత పెరగడంతో పనులు చేసేందుకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పని ప్రదేశాల్లో గుడారాలు ఏర్పాటు చేసేవారు. తాగునీటి వసతి, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచేవారు. పని లేని సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి వసతి లేక కూలీలు తంటాలు పడుతున్నారు.

- ఉపాధి పనులు కొనసాగుతున్న ప్రదేశాల్లో కూలీలకు నీడ కోసం గ్రీన్ షేడ్‌లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు. దీంతో తప్పని పరిస్థితిలో మండుటెండలోనే కూలీలు పని చేయాల్సి వస్తోంది. కనీస వసతులు లేకపోవడంతో పాటు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు అంతగా ఆసక్తి చూపడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిలువ నీడ లేక..

ఉపాధి కూలీలకు ఐదేళ్లుగా పార, గడ్డపార, తట్టలు తదితర సామగ్రి అందడం లేదు. కూలీలు సొంతంగా వాటిని సమకూర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతుండటంతో కూలీలు తాగునీటిని వెంట తీసుకెళ్తున్నారు. పని చేసే సమయంలో ఎండ తీవ్రతను తట్టుకోలేక సమీపంలో ఎక్కడ చెట్లు కనిపించినా వాటి నీడన కూలీలు సేద తీరుతున్నారు. కూలీలకు చిన్న పిల్లలు ఉంటే వారిని ఆడించేందుకు ఆయాలను కూడా నియమించాలని నిబంధనలున్నాయి. ప్రస్తుతం ఆయా వ్యవస్థను ప్రభుత్వం తీసేసింది. దీంతో చిన్న పిల్లలున్న కూలీలు పనులకు రావడానికి అసక్తి చూపడం లేదు.

ఉపాధి హామీ పథకం వివరాలు	
జాబ్ కార్డులు	2,53,050
మొత్తం సంఘాలు	13,715
పురుషులు	2,39,856
మహిళలు	2,73,098

కూలి రేట్లు పెంచాలి



ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు గిట్టుబాటు కావడం లేదు. రోజుకు ఒక కూలీకి రూ.275 అందించాల్సి ఉండగా రూ.150 నుంచి రూ.200 వరకు వస్తున్నాయి. పని చేసే కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించి రోజుకు రూ.500 చొప్పున కూలి చెల్లించాలి. ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలందరికీ పనిముట్లు అందించాలి.

– బోయిని శ్రీనివాస్

ప్రభుత్వం నుంచి సరఫరా లేదు




ఉపాధి హామీలో పనులు చేసే కూలీలకు గతంలో మేడికల్ కిట్లు, గడ్డపార, తట్టలు, వేసవిలో సేదతీరడానికి గ్రీన్ షేడ్ నెట్లను ప్రభుత్వం పంపిణీ చేసేది. వేసవి దృష్ట్యా కూలీలకు ఎండ దెబ్బతగలకుండా ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పని చేయాల్సి ఉంటుంది. గడ్డపార, గంప, వాటర్‌కు సంబంధించి ప్రతి రోజు రూ.5 చొప్పున అదనంగా కూలీలకు అందుతుంది. అత్యవసరమైన చోట వైద్య సిబ్బంది కూలీలకు అందుబాటులో ఉంటున్నారు.

– శ్రీనివాసరావు, డీఆర్‌డీప పీడీ

నష్టాల ఊబిలో చింత రైతులు

- పడిపోయిన చింత పండు ధరలు
- చీడపీడలతో పంటకు తీవ్ర నష్టం
- వడగండ్లతో రెట్టింపు
- కొనేవారు లేక నేలపాలు
- ఆందోళనలో రైతన్నలు

కోహీర్(జహీరాబాద్): చింతను సాగుచేస్తున్న రైతులకు చింతే మిగిలింది. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించక వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనికి తోడు కనివిని ఎరుగని రీతిలో ఈసారి చింతకు చీడపీడలు సోకి 40 శాతం మేర పంటకు నష్టం వాటిల్లింది. ఇటీవల కురిసిన వడగండ్ల వానతో తడిసి పాడై రైతులు మరింత నష్టపోయారు. కొనేవారు కరువై పండి కోతకొచ్చి నేలపాలవుతోంది. సీజన్‌లో పాతాళానికి పడిపోతున్న చింతపండు ధర ఇతర కాలాల్లో ఆకాశాన్నంటుతోంది.


కోహీర్‌లో పురాతన చింతచెట్టు

- కోహీర్ మండలం జామ, అల్లం పంటలతో పాటు చింత సాగుకు ప్రసిద్ధి. మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు పైడిగుమ్మల్, ఖానాపూర్, కొత్తూర్(కె), రాజనెల్లి, పీచేర్యాగడి తదితర గ్రామ శివార్లలో రైతులు చింత చెట్లను పెంచి పోషిస్తున్నారు. మూడు, నాలుగు వందల ఏళ్ల వయస్సుగల ఎత్తయిన చింత చెట్లు వేల సంఖ్యలో ఉన్నాయి.

గిట్టుబాటు ధర కరువు

- మండలంలో పండించిన చింత పండు గింజలు తీసి వాలిని రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలలోని మార్కెట్లలో విక్రయిస్తారు. గత రెండేళ్లుగా మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లభించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాల్‌కు రూ.6 నుంచి రూ.8 వేలు మాత్రమే పలుకుతుందని చెబుతున్నారు.
- గిట్టుబాటు ధర లభించకపోవడంతో చింత చెట్లను లీజుకు తీసుకోవడానికి వ్యాపారులు చొరవ చూపడంలేదు. ఈ సారి మండలంలో ఉన్న సగం చెట్లు వృథాగా ఉన్నాయన్నారు. పండు నేలరాలిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- చింత పండు నిల్వ చేసుకోవడానికి కోల్డు స్టోరేజీలు అందుబాటులో లేక రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో అందినకాడికి అమ్ముకోవాల్సివస్తోంది.

మొదటిసారి చీడపీడలు

- చింతపండుకు చీడపీడలు సోకిన దాఖలాలు గతంలో లేవని, ఈసారి చీడపీడలు సోకి 40 శాతం పంట నష్టపోయామని, గురువారం కురిసిన అకాల వర్షానికి, వడగండ్ల వానకు పండిన తీవ్ర నష్టం వాట్టిల్లిందన్నారు. తడిసిన చింతపండుకు డిమాండ్ ఉండదంటున్నారు.

కూలీల కొరత

- చింత సాగు చాలా సులభం. ఒకసారి నాటితే చాలు ఏళ్ల తరబడి దిగుబడులను ఇస్తుంది. పైగా ఒక స్థాయికి ఎదిగిన తరువాత నీరందించాల్సిన అవసరం ఉండదు. ఎరువులు, మందులు వాడాల్సిన పనిలేదు.
- అయితే పండిన పంటను ఎత్తయిన చెట్ల నుంచి దించడానికి తీవ్రంగా శ్రమించాల్సిఉంటుంది. చెట్లు ఎక్కే నైపుణ్యం ఉన్న కూలీల కొరత తీవ్రంగా ఉంది.
- అందుబాటులో ఉన్న కొద్దిమంది కూలీలు రోజు కూలి రూ. 1200 నుంచి రూ. 1500ల వరకు తీసుకుంటున్నారు. పండు సేకరణ, పైపొట్టు, పిక్కలు తీయడానికి, గట్టలు కట్టడానికి, రవాణాకు అదనంగా ఖర్చుచేయాల్సి ఉంటుంది.

ప్రాణాలతో చెలగాటం.

- సుమారు 20 నుంచి 25 మీటర్ల ఎత్తులోఉన్న చింత పండును వెదురు కర్రతో రాల్చడం ప్రమాదకరం. ఈ క్రమంలో ఏమాత్రం ఎమరుపాటుగా ఉన్నా ప్రాణాలు పోవడం ఖాయం.
- చింత చెట్లపై నుంచి పడి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం. ఈ ఏడాది చింత పండు రాలుస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మండలంలోని రాజనెల్లి గ్రామానికి చెందిన నర్సింలు, కోహీర్ పట్టణంలోని బసంత్పూర్ నివాసి వాజిద్‌లు ప్రాణాలు కోల్పోయారు.
- మండలంలోని మాచిరెడ్డిపల్లి, జహీరాబాద్ మండలంలోని రంజోల్లో మరొకరు చింతచెట్ల పైనుంచి పడి చనిపోయారని, కోహీర్ పట్టణంలోని బాహెర్వాడికి చెందిన ఖలీల్ చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడని రైతులు తెలిపారు.
- బాధితులకు నష్టపరిహారం చెల్లించి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన పంటను చెట్టు నుంచి వేరు చేసేందుకు ఆధునిక పరికరాలను అందుబాటులోకి తేవాలని, పంటకాలంలో పంటను నిల్వ చేసుకోవడానికి కోల్డు స్టోరేజీ సదుపాయం కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు.

రెండేళ్లుగా నష్టాలే



రెండేళ్లుగా చింతపండుకు మార్కెట్లో డిమాండ్ లేదు. వడగళ్ల వానతో పంటకు నష్టం వాటిల్లడంతో పాటు ధరలు గణనీయంగా పడిపోయాయి. ఈసారి కొత్తగా చీడపీడల సోకి 40 శాతం పంటకు నష్టం వాటిల్లింది. పంట నూర్పిడికి కూలీల కొరత తీవ్రంగా ఉంది. రోజు కూలి రూ.12 నుంచి 1500 తీసుకుంటున్నారు. పొట్టు తీసి గట్టలు కట్టడానికి అదనంగా చెల్లించాలి. సరైన గిట్టుబాటు ధర లభించక 50 శాతం చింత చెట్లు కొనుగోలుకు నోచుకోలేదు.

– సపోటవాలే ఖయ్యూమ్, రైతు, బసంత్పూర్, కోహీర్

ప్రాణాలతో చెలగాటం



నేను 30 ఏళ్లుగా చింత పంట నూర్పిడిలో కూలిగా పనిచేస్తున్నాను. మూడు నాలుగు వందల ఏళ్ల వయస్సు శాఖో పశాఖలుగా విస్తరించిన 25, 30 మీటర్ల ఎత్తయిన చెట్లపై ఎక్కి రక్షణలేకుండా చింత పంటను రాల్చడం ప్రాణాలతో చెలగాటమే. చెట్లపై నుంచి పడి నా తోటి కూలీలు ఎందరో ప్రాణాలు కోల్పోయారు. వారి కుటుంబాలు అనాథలయ్యాయి. చెట్లపై నుంచి పంటను దింపడానికి ప్రత్యామ్నాయ మార్గాలు కల్పించాలి.

– లంగ్డివాలే మాజిద్, కూలీ, కోహీర్

క్లుప్తంగా

స్టోరేజ్ పాయింట్ పరిశీలన


అధికారులకు సూచనలిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ రాధారెడ్డి

నర్సాపూర్: పదో తరగతి పరీక్ష ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్‌ను రాష్ట్ర అధికారి గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెనింగ్ డైరెక్టర్ రాధారెడ్డి పదో తరగతి ప్రశ్న పత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచే పాయింట్‌ను గురువారం ఉదయం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. స్టోరేజ్ పాయింట్ నుంచి తరలించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం



మెదక్ రూరల్: మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండలం శమ్నాపూర్ బస్టాండ్‌లో గురువారం గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. మృతుడి వయస్సు 28 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే 8712657921 ఎస్‌ఐ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వృద్ధురాలి అదృశ్యం


సురేఖ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇంటి నుంచి వెళ్లిన వృద్ధురాలు కనిపించకుండా పోయింది. ఈ సంఘటన గురువారం జరిగింది. పోలీసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన సురేఖ ప్రకాష్ తుల్కర్(58) ఆమె కుమారుడు సచిన్‌తో కలసి అశోక్‌నగర్‌లో నివాసం ఉంటుంది. ఈనెల 2వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమెకు మతిస్థిమితం సరిగాలేదని పోలీసులు తెలిపారు. వృద్ధురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బిజినెస్‌లో మెదక్ డీసీసీబీకి ద్వితీయ స్థానం


బ్యాంక్ చైర్మన్, సీఈఓను సన్మానిస్తున్న అధికారులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ఉమ్మడి మెదక్ జిల్లా శాఖ వ్యాపారంలో రూ.2 వేల కోట్లతో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. గురువారం బ్యాంక్ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, సీఈఓ శ్రీనివాస్‌ను శాఖ అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్ జనరల్ సెక్రెటరీ పవన్ కుమార్, స్టేట్ సెక్రెటరీ భరత్ రాజ్, బ్యాంక్ ఇన్‌చార్జి సంగమేశ్వర్, సిబ్బంది మమత తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మెదక్ రూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మెదక్ మండలం పాతూర్ గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కట్లె రాజు(40) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 4వ తేదీన పాతూర్ వద్ద మెదక్–రామాయంపేట రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న రాజును సంగారెడ్డి డిపో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి కుటుంబీకులు తరలించారు. చికిత్స పొందుతూ రాజు మృతిచెందాడు. మృతుడి తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ అదుపు తప్పి డివైడర్ ఢీకొని..

- 8వ తరగతి విద్యార్థి మృతి
- మరోవిద్యార్థికి గాయాలు
- మూలమలుపులో ప్రమాదాలు జరుగుతున్న వైనం

జోగిపేట(అందోల్): డివైడర్‌ను బైక్ ఢీకొనడంతో విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జోగిపేటలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఫయాజ్ అలీ(14) 8వ తరగతి చదువుతున్నాడు.

బైకుపై మరో విద్యార్థితో కలిసి అందోల్ నుంచి జోగిపేట వస్తున్నాడు. ఈ క్రమంలో ఫైర్‌స్టేషన్ మలుపువద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఫయాజ్ అలీకి తీవ్రంగా, మరో విద్యార్థికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే అంబులెన్స్‌లో సంగారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా చౌటకూరు సమీపంలో తుదిశ్వాస విడిచినట్లుగా చెబుతున్నా సంగారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లగా డాక్టర్లు పరీక్షించి చనిపోయినట్లుగా నిర్ధారించారు. పోస్టుమార్టం నిర్వహించి జోగిపేటకు తరలించారు.


ఫయాజ్ అలీ (ఫైల్)

జోగిపేటలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా వెంటిలేటర్ ఉన్నట్లయితే ఆస్పత్రికి వెళ్లేవరకైనా బాలుడు బతికేవాడని స్థానికులు చర్చించుకున్నారు.

హైవే అధికారుల నిర్లక్ష్యం

ఫైర్ స్టేషన్ వద్ద ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికిపైగానే మృత్యువాతపడ్డారు. పది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఫైర్ స్టేషన్ మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్‌లు వేయిస్తామని హైవే అథారిటీ అధికారి హామీ ఇచ్చి మూడు నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

సంగారెడ్డి టౌన్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువురని అరెస్ట్ చేశారు. గురువారం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు సంగారెడ్డి పట్టణంలోని బ్యాంక్ కాలనీలో బుధవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.43,830 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కలుషిత నీరు తాగిన గేదె మృతి

పటాన్‌చెరు టౌన్: కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన గేదె మృతి చెందింది. ఈ సంఘటన గురువారం జరిగింది. ఎస్‌ఐ కిష్టారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన కుమ్మరి రాజుకు చెందిన రెండు గేదెలు బొల్లారం పారిశ్రామికవాడ నుంచి వచ్చిన కలుషిత నీరు తాగి బుధవారం అస్వస్థతకు గురయ్యాయి. వాటితో పాటు మరో 12 గేదెలు కూడా అస్వస్థతకు గురయ్యాయి. వాటికి మండల పశువైద్యులు చికిత్స అందిస్తున్నారు. అందులో రాజుకు చెందిన ఒక గేదె మృతి చెందింది. రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుతో పాడి గేదె, ఆవు మృతి

మద్దూరు(హుస్నాబాద్): అకాల వర్షంలో పిడుగు పడి పాడిగేదె, ఆవు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండలంలో రేబర్తి గ్రామంలో జరిగింది. గురువారం బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బెల్లపు యాదయ్య, వంగపల్లి రాములు రోజు మాదిరిగానే బుధవారం రాత్రి తమ వ్యవసాయ బావి వద్ద గేదెను, ఆవును కట్టేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం బావి వద్దకు వెళ్ల చూడగా అవి మృతి చెంది కనిపించడంతో బోరున విలపించారు. పాడిగేదె రూ.70 వేలు, ఆవు విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


గేదె కళేబరం

శివాలయంలో చోరీ

- భద్రకాళి అమ్మవారి పుస్తె మెట్టెలు, హుండీ నగదు అపహరణ
- కేసు నమోదు

రేగోడ్(మెదక్): గోకర్ణేశ్వర శివాలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మండల కేంద్రమైన రేగోడ్‌లో గురువారం వెలుగుచూసింది. ఏఎస్‌ఐ మల్లయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగోడ్‌లోని గోకర్ణేశ్వర శివాలయంలో రోజూ మాదిరిగానే పూజ చేసేందుకు ఆలయ పూజారి మహేశ్ గురువారం ఉదయం వెళ్లాడు. దేవతల విగ్రహాలను శుభ్రం చేసే క్రమంలో భద్రకాళి అమ్మవారి మెడలో ఉండాల్సిన రెండు బంగారు పుస్తెలు, మెట్టెలు, బయట ఉండాల్సిన రెండు హుండీలూ కనిపించలేదు. హుండీలను పగులగొట్టి భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదును తీసుకుని వెళ్లారు. దొంగలు పడ్డారని నిర్ధారణకు వచ్చిన పూజారి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఏఎస్‌ఐ తన సిబ్బందితో ఆలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.


శివాలయంలో వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్‌ఐ మల్లయ్య

కోర్టు కేసులోని భూములు పట్టా చేయొద్దు

సీపీఐ జిల్లా కార్యదర్శి టీఎం కాలేక్


వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి టీఎం కాలేక్

నర్సాపూర్: వ్యవసాయ భూమికి సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున, ఆ భూమిని ఎవరి పేర పట్టా చేయొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి టీఎం కాలేక్ కోరారు. గురువారం ఈమేరకు మండల తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని నత్నాయిపల్లి గ్రామంతో పాటు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల్ల మండలం గుమ్మడిదల్ల, శేరికాన్‌పల్లి, మంగంపేట గ్రామాల పరిధిలో 1 నుంచి 31 సర్వే నంబర్లలో సుమారు 653 ఎకరాల 15 గుంటల భూమి ఉందన్నారు. కాగా ఆయా సర్వే నంబర్లలోని భూమిలో ఆయా గ్రామాలకు చెందిన సుమారు 300 రైతు కుటుంబాలు సుమారు 20 నుంచి 25 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నారన్నారు. కొందరు రియల్ వ్యాపారులు హైకోర్టులో భూములు తమవేనని కేసు వేశారని తెలిపారు. కేసు పెండింగ్‌లో ఉన్నదని, ఆయా గ్రామాలకు చెందిన కొందరు రియల్ వ్యాపారులతో కుమ్మక్కయి ఆ భూములను తమ పేరు మీద పట్టా చేయించుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఆర్‌ఐతో విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసినవారిలో నాయకులు కృష్ణ, సంజీవరెడ్డి, చంద్రారెడ్డి ఉన్నారు.

దంపతుల వాగ్వాదం

- అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భార్య ఆరోపణ
- విడాకుల కేసు కోర్టులో ఉందన్న భర్త


భర్తతో గొడవపడుతున్న అంజలి

మద్దూరు(హుస్నాబాద్): అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని భార్య విలేకర్లకు మొరపెట్టుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు బద్దిపడగ శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ముందు బుధవారం అతడి భార్య అంజలి నిరసన చేపట్టింది. దీనికి బదులుగా గురువారం శ్రీనివాస్‌రెడ్డి మండల కేంద్రంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతున్నాడు. అంజలి అక్కడికి వచ్చి వాగ్వాదానికి దిగడంతో శ్రీనివాస్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అంతకు ముందు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అవినీతిపై ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేయడంతో ఎంపీపీ కృష్ణారెడ్డి, తన భార్యను తనపై ఉసిగొల్పుతున్నాడని ఆరోపించారు. తమ విడాకుల కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని, కోర్టు తీర్పుకు అనుగుణంగా తాను వ్యవహరిస్తానని శ్రీనివాస్‌రెడ్డి తెలిపాడు.

పోరాట యోధుడు రణదివే



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

కొండాపూర్(సంగారెడ్డి): దేశంలోని కార్మికవర్గాన్ని ఏకతాటిపై నడిపిన పోరాట యోధుడు బిటి రణదివే అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. గురువారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సామాజిక సమస్యలు– కార్మిక వర్గం కర్తవ్యం అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడారు. సామాజిక విప్లవకారుడు కామ్రెడ్ రణదివే కార్మిక వర్గంలో ఐక్యత సాధించడం ద్వారానే దోపిడీని అంతం చేయగలమనే అంశాన్ని ముందుకు తెచ్చారన్నారు. దేశంలో సరళీకరణ విధానాల వల్ల జరిగిన సమ్మెలు జయప్రదమయ్యాయని గుర్తు చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6 నుంచి 14 వరకు సామాజిక న్యాయవారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ 13న రాష్ట్ర వ్యాప్తంగా 10 కే వాక్ ఫర్ సోషల్ జస్టిస్ నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని, సామాజిక సమస్యలపై సంతకాల సేకరణ, సర్వేలు, సంఘీభావ నిధి సేకరించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మాణిక్యం, పీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

మూకుమ్మడి దాడిలో వ్యక్తికి గాయాలు

పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు


దాడిలో గాయపడిన లింగం

చేర్యాల(సిద్దిపేట): ఓ వ్యక్తిపై మూకుమ్మడి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వీరన్నపేట గ్రామానికి చెందిన సూర్న లింగం బుధవారం రాత్రి గ్రామపంచాయతీ వద్ద ప్రదర్శించిన బలగం సినిమా చూశాడు. ఇంటికి వెళ్లి ఇంటి ముందు నిద్రించాడు. గురువారం తెల్లవారు జామున లేచి చూడగా ఇంటి ముందు లేదు. బావి దగ్గరకు వెళ్తున్న పెద్ద కుమారుడు సూర్న ప్రవీణ్‌కు వడ్లమార్కెట్ వద్ద లింగం టవల్, చెప్పులు పడిఉన్నాయి. అక్కడే రక్తం మరకలు ఉండడాన్ని చూసిన ప్రవీణ్ వెంటనే ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటికి వచ్చిన శ్రీకాంత్ మీనాన్న సద్దుణాచారి ఇంటి ముందు రక్తగాయాలతో పడిఉన్నాడని చెప్పాడు. వెంటనే అక్కడికి వెళ్లి 108లో చేర్యాల ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గాంధీకి తరలించాలని సూచించారు. తమ తండ్రిపైపై దాడి చేసిన ఎస్.మల్లేశం, పి.ప్రసాద్, జె.భాస్కర్‌పై చట్ట రీత్యా చర్య తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మతిస్థిమితం లేని మహిళను చేరదీసి..

కుటుంబ సభ్యులకు అప్పగింత

సిద్దిపేటకమాన్: మతి స్థిమితం లేని మహిళను సఖి సెంటర్ సిబ్బంది చేరదీసి వివరాలు తెలుసుకొని ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం జరిగింది. సఖి సెంటర్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మతి స్థిమితం సరిగా లేని మహిళను చిన్నకోడూరు పోలీసు స్టేషన్ నుంచి ఈనెల 3వ తేదీన సిద్దిపేట సఖి సెంటర్‌కు తీసుకువచ్చారు. ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలోని మానసిక విభాగ వైద్యులు పరీక్షించారు. తర్వాత ఎర్రగడ్డ ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. ఆస్పత్రిలో చూసుకోవడానికి ఆమెతో ఎవరూ లేకపోవడంతో సఖి సెంటర్ ఇన్‌చార్జి శ్వేత సెంటర్‌లో ఆశ్రయం ఇచ్చి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. రెండు రోజులు తర్వాత మహిళకు కొద్దిగా జ్ఞాపకశక్తి రావడంతో ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్ల గ్రామమని, తన పేరు నాగలక్ష్మి అని తన కుటుంబ సభ్యుల వివరాలు తెలిపింది. దీంతో సఖీ సెంటర్ సిబ్బంది గ్రామ సర్పంచి ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. దీంతో నాగలక్ష్మి చెల్లెలు గురువారం సఖి సెంటర్‌కు రావడంతో ఆమెకు అప్పగించారు.


మహిళను అప్పగిస్తున్న సఖి సెంటర్ సిబ్బంది

ఆవుల మృత్యువాత


మినీగూడ్స్‌లో తరలిస్తున్న ఆవులు

శివ్వంపేట(నర్సాపూర్): మినీగూడ్స్‌లో నిబంధలకు విరుద్ధంగా ఆవులను తరలిస్తుండటంతో మృత్యువాత పడ్డాయి. గురువారం తూప్రాన్– నర్సాపూర్ ప్రధాన రహదారి శివ్వంపేట పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఓ మినీ గూడ్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ఆవులను తరలిస్తున్నట్లు గుర్తించారు. మూడు మృతి చెందడటంతో వాహనాన్ని సీజ్ చేశారు. కరీంనగర్ జిల్లా కొత్తకొండ నుంచి సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌కు తరలిస్తున్నందున జరిమానా విధించినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావ్ తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి మినీ గూడ్స్‌లో ఆవులను తరలిస్తూ వాటి మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, ప్రధాన కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. నిత్యం పలు ప్రాంతాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఆవులను తరలిస్తూ వ్యాపారం చేస్తున్న చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.